వెళ్ళినప్పుడు అదేనా తల్లి కేకలేస్తే వేసుకుంటుంది. వేరే రెండుపెటల గొలుసు-ముత్యాల సెట్టూ వున్నాయి. అందుకు రాజేంద్రకి కూడా తెలపవలసిన పని లేదనుకుంది.

పది పన్నెండు రోజులు గడిచిపోయినాయి. ఒకరోజు శర్మ వచ్చి, కాస్సేపయ్యాక కుసుమతో అన్నాడు "రేపుకాని ఎల్లుండికాని ఊరు వెళ్తాను. నాలుగు రోజుల్లో వస్తాను" అని.

"ఏ వూరు? ఆ విడిపించుకున్న సరుకు అమ్ముడయిందా?" అని అడిగింది కుసుమ.

"సగం అమ్ముడయింది—పల్లిగా అమ్మడానికి వీలులేదు."

"ఏం? మరెలా?" సందేహంగా అడిగింది.

"జాగ్రత్తగా పెద్దపెద్ద షాపుల్లో యిచ్చేయటమే! వాళ్ళు కళ్ళు మూసుకుని అమ్మేస్తారు."

"ఎన్ని నేర్చావురా" అంది కుసుమ 'శర్మ ఎదిగిపోయాడు' అనుకుంటూ.

"ఏం చేయమంటావమ్మా! ఈ జానెడు పొట్టకి ఎన్ని తిప్పలూ! ఈ కాస్త సవ్యంగా జరిగిపోతే అమ్మనీ నాన్ననీ ఈ వూరు తీసుకొచ్చేస్తాను. ఇదంతా నీ చలవే పిన్నీ" అన్నాడు.

కుసుమ మనసు గాలిలో తేలింది.

వాళ్ళలా చాలాసేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మాటల్లో "రాత్రి రాలేదేమిరా! ఎక్కడ పడుకున్నావ్?" అని అడిగింది.

"రెండో ఆటకి సినిమాకెళ్ళాం. ఇంట్లో చెప్పలేదన్నా వినలేదు. రెండింటికి వచ్చి మిమ్మల్ని లేపాలని రాలేదు" అన్నాడు.

"అదే అనుకున్నాలే! బాబయ్య అడిగితే అదే చెప్పాను. ఏ సినిమాకు వెళ్ళారు"

"అనార్కలి—హిందీ."

"హిందీ అనార్కలా! ఏ టాకీసులో?" సంభ్రమంగా అడిగింది. హిందీ అనార్కలి కుసుమ చూడలేదు. ఎన్నాళ్ళనుండో చూడాలని రాజేంద్రతో అప్పుడప్పుడు అంటూనే వుంటుంది. ఎక్కడేనా మార్నింగ్ షో ఆడుతోందేమో వాకబు చేస్తూండండి. ఆ సినిమా నాకు చాలా ఇష్టం అంటూ. "సరే" అంటాడతను.

ఏ టాకీసో చెప్పి, "ఈ రోజే ఆఖరురోజు" అన్నాడు.

కుసుమ గబగబా తయారయింది. భర్త వస్తూనే బయలుదేరడమే తరవాయిగా.

రాజేంద్ర ఆరవుతుండగా వచ్చేడు.

కుసుమ సినిమా సంగతి చెప్పి అతన్ని తొందరచేసింది.

"నేను రాలేను కుసుమా! నువ్వూ శర్మా వెళ్ళిరండి" అన్నాడు రాజేంధ్ర.

కుసుమ మూంగమూతి పెట్టింది చంటిపిల్లలా "ఏన్నాళ్ళగానో యెదురు చూస్తున్న నాకు ప్రియాతి ప్రియమైన సినిమా! ఇన్నాళ్ళకి చూస్తూ—మీరు పక్కన లేకుండానా! ఉహుఁ! మీరు రాకపోతే నేనూ వెళ్ళను. ఈ రోజే ఆఖరు రోజట! పోనీ రెండో ఆటకి వెడదామా?" అంది.

"నువ్వలా అంటే ఏం చెప్పను కుసుమా! నా గురించి ఎన్నాళ్ళనుంచో నువ్వు కలవరిస్తున్న సినిమా మానేయడం నాకు బాగుండదు" అంటూ అతను బాగ్ తెరిచి చూపిస్తూ అన్నాడు "ఇది కంపెనీ డబ్బు! బ్యాంక్‌కి టైము అయిపోయింది. ఇంటికి తీసుకొచ్చేను. ఇంత డబ్బు ఇంట్లోపెట్టి వెళ్దామా, చెప్పు!" అన్నాడు.

"బాగుంది! బీరువాలోపెట్టి తాళం వేస్తాను; శర్మ వుంటాడుగా! మనం లేకుండా ఎక్కడకి వెళ్ళడు!"

రాజేంద్ర యెన్నివిధాల చెప్పినా కుసుమ వినలేదు. రాజేంద్ర రాకపోతే తనూ మానేస్తానంది. అతనికి యెక్కడికి కదలాలని లేకపోయినా తప్పనిసరి అయి కుసుమతో బయలుదేరాడు.

వెళ్తూ శర్మతో అంది కుసుమ. "జాగ్రత్తరోయ్" గొంతు తగ్గించి అంది: "బీరువాలో డబ్బు పెట్టేను జాగ్రత్త! బయట కూడా వద్దు! లోపలే తలుపులు వేసుకుని కూర్చో!" అంది.

"అలాగే" అన్నాడు శర్మ కలల్లో తేలిపోతూ. (సశేషం)




# ఈ కథ సెప్టిక్ అయ్యింది

డి. నారాయణవర్మ

బతకడానికి యెంతకైనా తెగించే ఈ రోజుల్లో రామచంద్రం బడిపంతులు ఉద్యోగానికి సాహసించడం విడ్డూరంగాదు. దీన్ని వింతగా చెప్పుకోవాల్సిన పనేంలేదు. ఆతగాడు అర్జంటుగా తాలూకా హెడ్ క్వార్టర్స్ నుండి మారుమూల గ్రామానికి బదిలీ అయిన కారణం వింటే మాత్రం విడ్డూరంగానే వుంటుంది మరి!

ఏలుబడిలో ఎమర్జన్సీ లేకపోయినా సాగుబడిలో కావాల్సినంత దౌర్జన్యం వుందనేందుకు నిదర్శనంగా సమితి ప్రెసిడెంటు చర్యలను చెప్పుకోవచ్చు. అటువంటి శాల్తీకి. సారీ.... శక్తికి రామచంద్రం సకాలంలో సవినయంగా నమస్కారం చేయకపోవడం పెద్ద అపరాధం అయిపోయింది. ఇంకేముంది....నిమిషాలమీద బదిలీ ఉత్తర్వులు జారీ అయిపోయాయి. ఇక రెండు చేతులెత్తి వంద నమస్కారాలు చేసినా లాభం వుండదని రామచంద్రానికి అర్థమయింది. కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలినా బదిలీ ఆగదని రూఢి అయింది. అఫ్టరాల్ బదిలీ గురించి రామచంద్రం ఆత్మాభిమాన్ని చంపుకోదలుచుకోలేదు.

శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ అవతారం కాబట్టి వనవాసకాండను అత్యద్భుతంగా - అతి హృదయవిదారకంగా చిత్రించారు కవిపుంగవులు. వట్టిపేరులోనే గాకుండా పౌరుషం-త్యాగ గుణంలాంటి శ్రీరామచంద్రుని కోవకు చెందిన లక్షణాలున్నా, రామచంద్రం ఆఫ్టరాల్ మనిషైనందున, పూర్ ఫెలో బండిపంతులై వున్నందునా, అందునా సమితి ప్రెసిడెంటుకు సకాలంలో నమస్కారం చేయకపోవడం మినహా మరే చరిత్రా లేనందున, ఆతగాడి బదిలీకాండను రాయడానికి ఏ రచయితా పూనుకోలేదు.

ఒంటెద్దు బండిలో సామానంతా యెక్కించాడు. ప్రాణాలున్న శాల్తీలుగా పెళ్ళాం పిల్లల్ని అందులో నొక్కాడు. తను బండి వెనక నడుస్తూ బదిలీయాత్రకు బయలుదేరేడు. సత్తరకాయ చంటిదాన్ని కాసేపు పెళ్ళాం వళ్ళోనూ మరి కాసేపు తన భుజాల మీదకు మార్చుకొంటూ అలా వాగులూ వంకలు, ఏళ్ళూ, వూళ్ళూ దాటి... దాటి... దాటి, మజిలీలు చేస్తూ; మాటిమాటికీ సమితి ప్రెసిడెంటు మీద వచ్చే కోపాన్ని, చీటికీమాటికీ పాలకోసం గీపెట్టే చంటిదాని మీద ప్రదర్శిస్తూ ఎట్టకేలకి గమ్యస్థానం చేరుకున్నాడు.


గవర్నమెంటు దృష్టిలో తప్పించి, రామచంద్రం బదలీ అయిన వూరు వూరుగాదు. కనీసం పల్లెసీమ లక్షణాలుగూడా లేవు. పాలెం అనబడే ఆ వూళ్ళో లెక్కగా ఇరవై అంటే ఇరవై గుడిసెలే వున్నాయి. వసతులు లేవు. వనరులులేవు. మంచి వూరు కాదు గదా మంచి నీళ్ళు కూడా పాలెంలో దొరకవు దూరానున్న మోటబావిలో తప్పించి.

అటువంటి గుడిసెల పాలెంలోని రామచంద్రం ప్రవేశించగానే, మోచేత్తో బుంగను చంకనాన్చుకోని తపుగోలతో పరిమళ్ళ కడ్డం బడుతూన్న నల్లటి మనుష్యులు, గూటీబిళ్ళ ఆడుకొంటున్న కుర్రాళ్ళు, మోటబావి నుంచి మట్టికడవతో నీళ్ళు మోసుకొస్తున్న మోటు ఆడవాళ్ళు కనిపించారు. గోచి ఆ ప్రాంతపు యూనిఫారంలా, పెద్దా చిన్నా భేదం లేకుండా అందరి నగ్నశరీరాలమీద అలంకారంలా వుంది. ఆడవాళ్ళు రవిక తొడక్కుండా గుండెల్ని, గుండెలమీది బరువుల్ని పట్టి పట్టిచూద్దామన్నా వీలులేనంతగా కోకతో మానేజ్ చేసిన తీరు రామచంద్రాన్ని చకితుణ్ని చేసింది. వాళ్ళు మనుష్యులు అనుకోవడానికి ఆధారాలు అక్కడక్కడా వున్నా, మట్టివాసనతో అనాకారీగా కానవచ్చే పాలెం వాస్తవ్యులు రామచంద్రం రాకను విచిత్రంగా తిలకించారు. దారి తప్పాడేమో అనుకున్నారు. దగ్గరకు రాగానే చుట్టూ మూగి, ఎగాదిగా జంతువుని చూసినట్టు చూశారు. రామచంద్రం చెప్పిన మాటలు విని స్వాగతం పలకడానికి బదులుగా యెద్దేవాచేశారు.

"ఏం బావుకుందామని బాబూ, యిలా అరిజెంటుగా పెళ్ళాం బిడ్డలతో మా వూరు పారొచ్చేత్తన్నావు? వొచ్చి యిక్కడ్ని ఏం సేత్తావని? ఎవుల్ని వుద్దరిత్తావు? మమ్మల్నా! ఏటీ బడి సొబుతావా....మా బాబే? సదూకుంటే ఏటొత్తదట, నీలా పొట్ట చేత్తో బట్టుకొని దేశాలు తిరగడం తప్పించి! ఇదిగో నువు బడి సొప్పినా మా గుంటలు సదూకోరు. అళ్ళకెందుకురా సదువు, సంకనాకనా! ఇదిగో....నేలని నమ్ముకొంటే నోటికి ముద్దెల్లి దినం గడుత్తాది" అనే అభిప్రాయాలు తొలిపలుకులలో పాలెం వాళ్ళు వ్యక్తం చేశారు. రామచంద్రం మౌనంగా బండిమీద సామాను దింపుతూంటే గుంపుగా మూగి "ఇదిగో బాబూ, నువ్వొట్టి పిచ్చోడిలాగున్నావే? గాలివానకి ముందటేడు మా పాలెంలో బడి పెట్టేరు. ఆయాల్టి నుంచి యియ్యాల్టదాకా సదువు సొప్పడానికి వొచ్చినోడూ లేడు. వొచ్చినా సదూకునేవోడూ లేడు. మా కెందుకు బాబూ సదువులు. మట్టిని నమ్ముకొన్నాళ్ళ నోట్లో మన్నుకొడ్డానికి తప్పితే!" అని హెచ్చరించారు.

రామచంద్రంలో శ్రీరామచంద్రుని లక్షణాలున్నాయి గాబట్టి వాళ్ళ మాటలకు నీర్సపడిపోలేదు. మొక్కపోని ధైర్యంతో "మిమ్మల్ని మారుస్తాను. మీలో విజ్ఞాన






కాంతుల్ని వెలిగిస్తాను. సమితి ప్రెసిడెంటుకి నమస్కారం చేయకపోవడం ఒక విధంగా మంచిదే జరిగింది" అనుకున్నాడు. ఆ ధైర్యంతోనే ఒంటెద్దు బండిని వెనక్కి పంపేశాడు.

కాని గుడిసె బడిని చూశాక, అది పేరుకే బడి అని, చదువు మాత్రం గంగరావి చెట్టు క్రిందేనని తెలిశాక రామచంద్రం గుండెల్లో రాయి పడింది. దీనినిమించి తలదాచుకోవడానికి గుడిసె లేదుగదా, గూడూ-నీడా కూడా పాలెంలో దొరకదని అర్థమయాక 'అయితే నేనిప్పుడెక్కడుండాలి' అనే ఆందోళన కలిగింది. రామచంద్రం చేతులు తెగిన రచయితలా విలవిల్లాడిపోయాడు.

"లంజ....!" ఛ... ఛ యింకా లోతుకు వెళ్ళి సమితి ప్రెశిడెంటుని వట్టుకొని రామచంద్రం తిట్టిన తిట్లన్నీ యిక్కడ చెప్పడం అంత సభ్యతగా వుండదుగాని, గుంభనంగా చెప్పాల్సివస్తే మాత్రం తిట్టిన తిట్టు తిట్టకుండా నిఘంటువులకు ఎక్కని నామవాచకాలుపయోగిస్తూ మరీ తిట్టుకున్నాడు.

దాంతో సమస్యలు పరిష్కారం కావుగా! బడితో సహా పాలెంలో వున్నవన్నీ గుడిసెలే! రామచంద్రం బడిపంతులుగా పాలెంలో వుండాలంటే, తనూ ఓ గుడిసె వేసుకోవడం తప్పించి మరో మార్గంలేదు. ఏం చెయ్యాలో పాలుపోని రామచంద్రం ఏడ్పుమొగం పెట్టాడు.

పాలెంవాళ్ళు అనాకారీ మనుష్యులే అయినా, సమితి ప్రెసిడెంటు వంటివాళ్ళు కారు గనక, నీడ చూపలేకపోయినా, కనీసం గుడిసెకట్టిస్తాం అని గూడా అనకున్నా,గూడుదొరికే చోటు చూపారు. దూరంలో క్రోసున్నరలో మినుకు మినుకుమంటూ కానవచ్చే మేడను చూపుతూ, అక్కడికి వెళ్ళి వరాలమ్మగార్ని అడిగి చూడమన్నారు. ఈ చుట్టుప్రక్కల వూళ్ళలో వుద్యోగాలు చేసుకొనే కొందరు పంతుళ్ళు వరాలమ్మగారింట్లోనే వుంటున్నట్టు కూడా తెలిపారు. "హారి ప్రెసిడెంటూ, ఎంత అవస్త కొనితెచ్చావురా!" అనుకుంటూ రామచంద్రం ఆ క్షణమే పొలాలకు అడ్డుబడ్డాడు.

ఆ చుట్టుప్రక్కల ఇరవై గ్రామాలకు మధ్యగానున్న ఆ మేడ పొలాలమధ్య కట్టని కోటలావుంది. కోటకు వరాలరాజంటూ యజమాని వున్నా, వరాలమ్మగారిని గురించి తప్పిస్తే, నామ మాత్రంగా కూడా రాజు గురించి

ఎవ్వరూ చెప్పుకోరు. అసలా రాజు ఎవరికీ తెలియదు గూడాను; వడ్డీకి అప్పులివ్వడం, తన ఖాలుపట్టడం దగ్గర్నుంచి, తగువులు పెట్టడం చేర్చడం, పెళ్ళిళ్ళు జరిపించడం, విడదీయడం వరక్షూ యిలా ఒకటేమిటి ఒకందుకేమిటి మంచికి చెడ్డకి వరాలమ్మగారుండాల్సిందే. ఆ ప్రాంతీయులు వరాలమ్మగారి సలహా సంప్రదింపులు లేంది ఊపిరి గూడా పీల్చుకోరు. ఒక్క మాటలో చెప్పాలంటే, వందమంది సమితి ప్రెసిడెంటులకుండని పలుకుబడి ఆమెకు ఆ ప్రాంతంలో వుంది.

ఇకపోతే ఊళ్ళపెత్తనం, ఇంటిపెత్తనంతో సహా వొంటిపెత్తనం కూడా ఆమెదేనన్న వదంతి కూడా వుంది. అయితే యిందుకు ఆధారాలు, రుజువులు లేకున్నా తరుచు పట్నాల నుంచి వచ్చిపోయే కార్లు, జీపులు; రెండేసి మూడేసి రోజులు కోటలోనే తిష్టవేసే పెద్దపెద్ద మనుష్యులు. వాళ్ళకు జరిగే విందులు వినోదాలు, అరమరికలు లేకుండా వచ్చిన వాళ్ళతో వరాలమ్మగారు మెలిగే పద్ధతి చూసి ఓర్వలేని వాళ్ళు అలా వదంతులు పుట్టించి వుండొచ్చు! వీటికి తోడు ఆమె అందం అలాంటిదే మరి; పచ్చగా.... మేలిమి బంగారంలాంటి వొంటి ఛాయ, వొంటిమీద నిత్యం ఒత్తుగా వుండే బంగారం నగలు. కళ్ళల్లో ఆకర్షణతోపాటు తీవి, సంతానం వున్నా జారిపోని బిగువు బింకం.... యివన్నీ చూస్తే, ఇంత అందమైన ఆడది అంతమంది పెద్దపెద్దోళ్ళతో పరిచయం వున్నది, ఆ అనాకారీ మొగుణ్ని-రాత్రింబవళ్ళు మట్టి పిసుక్కున్నే మోటుమనిషిని దగ్గరికెలా రానిస్తుంది? తప్పకుండా వొంటిపెత్తనం కూడా వరాలమ్మదే అయివుంటుందని అనిపించక మానదు.

అంచెలంచెలుగా మేడ చేరేలోగా యీ వివరాలన్నీ తెలిసినా రామచంద్రం పెద్దగా పట్టించుకోలేదు. తనకనవసరం అనుకుంటూ విన్నది విన్నట్టే మర్చిపోతూ వచ్చాడు. గుండెలవిసేలా ఒగుర్చుతూ మేడలోకి జొరబడ్డాడు. ఈజీచైర్‌లో తీవిగా పడుకొని ఏదో ఆలోచిస్తూ గుండెలను చేత్తో రాసుకుంటున్న వరాలమ్మ రామచంద్రం రాకకు వులిక్కిపడింది. రామచంద్రం గుక్క తిప్పుకోకుండా విషయం అంతా వివరించి కాస్త నీడిచ్చి పుణ్యం కట్టుకోమని అభ్యర్థించాడు.

వరాలమ్మ ఆరడుగుల ఆడదైనా ఆ సమితి ప్రెశిడెంటు కాదు గాబట్టి రామచంద్రం నమస్కారం చేయకపోయినా అభ్యర్థన శ్రద్ధగా వింది. క్షణం దీర్ఘంగా ఆలోచించింది. ఆపైన సైగతో రామచంద్రాన్ని పెరట్లోకి తీసుకెళ్ళి గొడ్లచావిడి చూపించి ఇదే పోర్షన్ అంది. రామచంద్రం తెల్లబోయాడు.

"మరేం చేయమంటారు. ఇదే ఖాళీగా వుంది. పశువులకు మీకు మధ్య తడికలు కట్టిస్తాను. అసలు దీన్ని యిచ్చే వుద్దేశ్యం లేదనుకోండి. అయినా నిన్ను చూశాక పిల్లలతో అర్థంతరంగా వచ్చావని తెలిశాక యివ్వాలనిపించింది. ఇదిగో.... మీకిష్టమైతేనే దిగండి. అద్దెమాత్రం నెలకి ముప్ఫయి" అంది వరాలమ్మ హుందాను వెళ్ళబోస్తూ.

రామచంద్రం మరి ఆలోచించే పరిస్థితి కొని తెచ్చుకోలేదు. అలాగే అంటూ తలూపి ఆ రాత్రికి రాత్రే గొడ్లపాకలో గృహప్రవేశం చేసేశాడు. ఆ తర్వాత అద్దె గురించి, దోమల రాగాలతో పేడ కంపుకొట్టే పోర్షన్ గురించి మధనపడిపోతూ, వరాలమ్మను ఏం అనుకోలేక వళ్ళు మండగా ప్రక్కనున్న పశువుని చూస్తూ ప్రెశిడెంటుని కీర్తించేశాడు.

భాగ్యవంతుడికి పట్టిన జబ్బులు మధ్యతరగతి వాడి సమస్యలు ఓ పట్టాన వదలవు, కష్టైలతో తప్పించి. నమస్కారాలు ఆశించే సమితి ప్రెశిడెంటు ప్రజలకు ఏ మస్కాకొట్టాడోగాని తపీమని ఎం. ఎల్. ఏ. అయిపోయాడు. ఈ రెండేళ్ళలోనూ రామచంద్రం ఎన్ని విధాల ప్రయత్నించినా బదిలీ రాలేదు. పైగా పాలెం వాస్తవ్యులు బదిలీ అయి వెళ్ళడానికి ఒప్పుకోలేను.

"నువ్వు నిజంగా శ్రీరామచంద్రుడివే బాబూ; లేపోతే నువ్వేటి.... ఎ పంతులూ రాని మా








వూరు రాడమేటి? ఆయాళ నువు పెళ్ళాం బిడ్డలతో వత్తాంటే ఎద్దేవా చేసినాం; సదువెందుకు సంకనాకనా అని ఎగతాళి సేసినాం; మరి యియ్యాల మా కుర్రాళ్ళు సదువంటే ఎగబడుతున్నారు. పుత్తకాలు చదివేత్తన్నారు. మట్టి పిసుక్కునే మాకు సదువంటే ఏటో తెలిక గేనం లేకుండా ఏతో వాగేసినాం; నువ్వు దేవుడివి బాబూ దేవుడివి. నువు మమ్మల్ని ఇడిసిపోడానికి యీల్లేదు. ఈడ్నే వుండాలి" అంటూ పాలెం వాస్తవ్యులు ముందు జాగ్రత్తగా 'మాకీ పంతులే వుండాలం'టూ ప్రభుత్వానికి వరాలమ్మ ద్వారా మహజర్లు పంపుకోవడంతో తనకీ జన్మకు బదిలీ వుండదంటూ నిశ్చయానికొచ్చేశాడు రామచంద్రం. అయితే వాళ్ళు వంగి వంగి రోజూ నమస్కారం పెడుతూన్నందుకు మాత్రం పొంగిపోలేదు.

సీత తప్పిపోయినందుకు శ్రీరామచంద్రుడు విలపించనట్టుగా మన రామచంద్రం ఏడ్వడం ఇక బదిలీ జరగదని మాత్రంకాదు. రూపురేఖలు మారిపోతూ పెళ్ళాం రోజురోజుకీ ఎండిపోతున్నందుకుగాదు. ఎదుగుతూన్న పిల్లలకు సరైన విద్యావకాశాలు లేక సూటీబిళ్ళ, కోతికొమ్మచ్చి ఆటలకు రుచిమరిగి అనాకారీలుగా తయారవుతూన్నందుకూ గాదు. మరెందుకంటే, మరో చంటిది పుట్టుకొచ్చి తల్లిపాలులేక-డబ్బాపాలు మరేపాలు తాగకుండా తల్లిపాలకోసమే నేలబడి పొర్లాడే పరిస్థితి చూసి, ఏం చెయ్యాలో తోచక గత్యంతరం లేక ఘోరున ఏడ్చాడు.

రామచంద్రం ఏడ్చినంత మాత్రాన చంటిది నోరు మూయలేదు. ఎండిన డొక్కలు యెగరేసుకుంటూ, అమ్మా అమ్మా అంటూ రోదిస్తూ ఏడ్వడానికి శక్తిలేనప్పుడు కళ్ళు తేలవేస్తూంటే రామచంద్రం గుండె చెరువైపోయింది. రాత్రింబవళ్ళు తేడా లేకుండా సాగుతూన్న ఈ రోదన కాంత మేడలోని వాళ్ళందరికీ విసుగు పుట్టించేసింది.

"ఏమిటి.... ఏమిటా ఏడుపు.... ఇక ఆ ఏడుపుకి రాత్రి పగలూ లేదా! మేం నిద్రపోవాలా లేదా! పెద్దవాళ్లు ఏం చేస్తున్నారు, కాస్త ఊరుకోబెట్టక్కర్లేదూ. కనగానే సరా? అసలెందుకు

ఏడుస్తుందలా॥"

ఓ అర్ధరాత్రివేళ నిద్రపట్టని వరాలమ్మ కోపంగా కేకలు వేస్తూ వచ్చింది. గుమ్మానికి అంత దూరంలో నిలబడి చంటిదాన్ని చంక మార్చుకుంటూ వరాలమ్మ కోపంగానే రెట్టించే సరికి రామచంద్రం సమాధానం యీయలేక పోయాడు. నీర్సంగా గోడకు జేరబడి దీనంగా శూన్యంలోకి చూశాడు. మూడోసారి పురిమి చూస్తూ అడిగేసరికి రామచంద్రం పెళ్ళాం కీచు గొంతుకతో చెప్పింది.

"తల్లిపాలు లేకా॥" అంది. వరాలమ్మ కళ్ళ పెద్దవిచేసి నోరు నొక్కుకుంటూ అలా ఆశ్చర్య పడుతూనే లోనికి వచ్చి 'ఏమిటీ మరేపాలు తాగడంలేదా॥' అని అడిగింది. రామచంద్రం దంపతులు తలలు అడ్డంగా ఆటించగా తటాలున చతికిలబడింది. అంతెత్తు మనిషి అలా కూర్చోవడంతో ఎందుకోగాని రామచంద్రం దంపతులు హడలిపోయారు.

వరాలమ్మ అలాగే కన్నార్పకుండా గిరగిర తిరుగుతూన్న చంటిదాని వంక చూసింది. అలా చూసి చూసి తన చంకలో చంటిదాన్ని ప్రక్కన కూర్చోబెట్టి రామచంద్రం చంటిదాన్ని ఒళ్ళోకి లాక్కొంది. రామచంద్రం ఎదురుగా వున్నాడని కూడా గుర్తించకుండా జాకెట్ తొలగించి స్తనం అందించింది. ఎండిపోయిన రొమ్ములతో పోట్లాడి పోట్లాడి అలిసిపోయి ఏడ్వడానికే బలి అయిపోయిన పసికందు కళ్ళకు బంతుల్లాటి స్తనాలు కనుపించగానే ముందుగా కాస్త బెదిరింది. ఆ తర్వాత తెప్పరిల్లి రెండుచేతులతో అందుకొని వెర్రి ఆనందంతో కరుచుకుపోయింది.

"మా అమ్మ తాగవే॥ నా బంగారు కొండా నీ బుల్లి కడుపునిండా తాగవే॥" అంటూ వరాలమ్మ తన అక్కున చేర్చుకొని లాలిస్తూంటే చంటిది కేరింతలు కొడుతూ, గారంగుడుస్తూ, 'ఊ ఊ' అంటూ మత్తుగా మాట్లాడుతూ పాలు త్రాగసాగింది. ఈ దృశ్యం చూసిన రామచంద్రం భోరున యేడుస్తూ రెండుచేతులెత్తేశాడు.

"ఛ....ఛ....ఏమిటి మాష్టారూ-ఎందుకలా ఏడుస్తారు॥ మీరు మగాళ్ళు కాదా॥ ఈ మాత్రం దానికే యింత యిదైపోతే యెలా? సమస్యలు మనిషికి కాకపోతే మానుకి వస్తాయా. కాస్త గుండె నిబ్బరంగా వుండాలి. మీరీ విషయం చెబితే నేనే యిచ్చేదానిగా పాలు. ఇదిగో నాకూ బిడ్డలున్నారు. పేగుతీపి నాకూ తెలుసండి. మీకేం భయంలేదు. మీ పాపకు పాలు నే నిస్తాను. నా బిడ్డకిచ్చేంతవరకూ నాకు పాలున్నంత వరకూ యిస్తాను. సరేనా॥" అని భరోసా యిచ్చింది. రోజూ మూడుపూటలా పాపను మేడమీదకు తీసుకురమ్మని వెళ్ళే ముందు రామచంద్రం భార్యకు చెప్పింది.

అలా నెలరోజులు గడిచాక చంటిదానికిచ్చిన చనుబాల నిమిత్తం రోజుకి లీటర్ చొప్పున, లీటర్‌కి రెండురూపాయల రేటు చొప్పున అరవైరూపాయలు యిమ్మనమని నిష్కర్షగా కబురంపింది. ఇది రామచంద్రంకు విడ్డూరంగా కనిపించలేదు. అద్దెతోపాటు అరవైరూపాయలు కలిపి సంతోషంగా పంపించాడు.

కాలం యిలా జరిగిపోతే బావుణ్ను. కాని ఓ సుప్రభాతాన యిక పాలు యివ్వనంటూ వరాలమ్మ ఖచ్చితంగా చెప్పడంతో రామచంద్రం బాధపడ్డాడు. కాస్త కోపం కూడా వచ్చింది. రేటు యిస్తున్నాం కదా అనే ధీమా అలా కోపాన్ని కలగజేసింది. ఎందుకివ్వనంటూందో తెలుసుకోవాలని రామచంద్రం మేడెక్కాడు.

"అవునండీ. ఇవ్వనన్నాను. ఇవ్వను. ఇంత కాలం మీరు డబ్బిచ్చారే అనుకోండి. అయినా యిక యివ్వనన్నాను" అంది తాపీగా.


"ఇప్పుడు మరెలా?" అన్నాడు రామచంద్రం అయోమయంగా.

"ఎలా అంటే నేనేం చేయను" అంది.

"మీ కిది భావ్యంకాదు" రామచంద్రం అన్నదాని కామె చురచురా చూసింది.

"బాగుంది మీ వరస. అయితే యిలా ఇంత కాలం యివ్వాలని మీ వుద్దేశ్యం॥" సూటిగా ప్రశ్నించింది.






"పాలున్నంతవరకూ మీ బిడ్డకు యిచ్చేంత వరకూ యిస్తానని మీరే అన్నారుగా॥ అందుకే అడుగుతున్నాను" అన్నాడు. వరాలమ్మ సమాధానం ఈయలేక మౌనం వహించడంతో "అసలెందుకు ఇవ్వనంటున్నారో దయచేసి చెబుతారా॥" అని అడిగాడు.

"చెప్పాలా॥ నేను చెప్పను. చెప్పే అవసరం నాకు లేదు" అంది మొండిగా.

రామచంద్రం అదోలా నవ్వాడు "మీరు చెప్పకపోయినా కారణం తెలియదనుకున్నారా॥ నా కంతా తెలుసు" అన్న రామచంద్రం మాటలకు ఆమె వులిక్కిపడింది. మొగం రంగులు మారింది.

"మీకు తెలుసా?" అస్పష్టంగా గొణుక్కుంది.

"తెలుసు. నాకు తెలిసిందాన్ని మీ మొగం మరింత పటిష్ఠం చేసింది. కేవలం నా గురించి నా బిడ్డకు పాలు ఇవ్వననడానికి కారణం తెలుసు వరాలమ్మగారూ॥ నిజానికి యిది మీకు పుట్టిన బుద్ధికాదు. ఒకరి ప్రేరణవల్ల మీరీ నిర్ణయానికి వచ్చారు కదూ॥" అని సూటిగా అడిగేసరికి వరాలమ్మ కంగారు పడిపోతూ మొగానికి పట్టిన చెమట తుడుచుకుంటూ "మాష్టారూ. మీరేం మాట్లాడుతున్నారో నా కర్థం కావడంలేదు. దయచేసి కాస్త వివరంగా చెప్పండి" అని ప్రాధేయపడింది.

"చెప్పడానికేముంది. ఆ సమితి ప్రసిడెంటు అదే ఎం.ఎల్.ఏ మీ ఇంటికొచ్చాడు గదూ॥ మూడురోజులు యిక్కడి తిష్టవేసి రాచమర్యాదలు పొందాడు గదూ॥ వాడు....వాడు చేసిందే యిదంతాను. ఆయనగారే యివ్వవద్దన్నారు గదూ పాలు"

"కాదు....కాదు" వరాలమ్మ తేలిక పడుతూ అంది.

రామచంద్రం నమ్మలేదు.

"నమ్మలేను. మీరా నిజాన్ని ఒప్పుకోరని నాకు తెలుసు. ఆయనకి సకాలంలో నమస్కారం చేయలేదని నన్ని మారుమూల ప్రాంతానికి అకారణంగా బదిలీ చేశాడు. ఇందుకు నే నెన్ని విధాల నష్టపోయానో మీకు తెలియదు. అయినా సహించాను॥ ఆయన ఎం.ఎల్. ఏ ఆయాక మీ యింటికి వచ్చాక

కూడా నేను నమస్కారం చేయలేదు? ఎందుకంటే ఇక నన్నేమి చేయగలడని? అయినా చేయాలనే చూశాడు. చిన్న వంక దొరికితే చాలు వుద్యోగం వూడబీకించాలనే ప్రయత్నంలో చేయాల్సినవన్నీ చేశాడు. నా స్కూల్ విజిట్ చేశాడు. పాఠెంలో నా గురించి ఆరాలు తీశాడు, నన్ను ఇరికించడానికి పాఠెం గ్రామస్థులను శతవిధాల హింసించాడు. వాళ్ళు మనసున్న మనుష్యులు వరాలమ్మగారూ? ఆయనగారి వుద్దేశ్యం గ్రహించిన గ్రామస్థులు ఎం.ఎల్.ఏ అనే గౌరవం కూడా యివ్వకుండా నిలబెట్టి కడిగేశారు. దాంతో యిక నన్నేం చేయలేక, యిక ఏ విధంగా కక్ష తీర్చుకోవాలో తెలియక నా బిడ్డకు పాలిచ్చే మిమ్మల్ని మానివేయమని చెప్పాడు. మీరూ, మీరు పెద్దలు కాబట్టి మీరు విన్నారు.

వరాలమ్మగారూ! నేను ఎం.ఎల్.ఏ అయిన సమితి ప్రశిడెంటుకి నమస్కారం చేయక పోవచ్చు. అది నా వ్యక్తిత్వానికి, ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం. కాని రెండు చేతులెత్తి మొక్కడంకాదు, మీ కాళ్ళు పట్టుకుంటాను. నా దీనపరిస్థితికి జాలిపడి, సాటి మనిషిగా కొన్నాళ్ళు అంటే చంటిది అన్నం ముట్టేవరకూ పాలివ్వండి ప్లీజ్....ప్లీజ్...."

రామచంద్రం యీ విధంగా విషయం అంతా విప్పి చెప్పినా వృథాప్రయాస అయింది. "ఆయనకీ మీకు లక్ష గొడవలుండొచ్చు. అవి నా కనవసరం. కాని పాలివ్వలేను....ఎందుకని ఎదురుప్రశ్న వేయొద్దు. నన్ను విసిగించకుండా దయచేసి వెళ్ళండి" అని వరాలమ్మ విముఖత ప్రకటించడంతో రామచంద్రం మరి చేసేదిలేక వేడి నిట్టూర్పుతో వెనక్కి తిరిగాడు.

ఎం. ఎల్. ఏ మీద ఏర్పడిన కోపాన్ని మించిన కోపం వరాలమ్మమీద రామచంద్రానికి కలిగినా, వరాలమ్మ తన బిడ్డకు పాలివ్వడం మానివేసిననాటి నుంచే, తన సొంత బిడ్డకు కూడా పాలివ్వడం మానుకుందని తెలిశాక కోపం కాస్త తగ్గించుకున్నాడు. కాని ఆమెలో వచ్చిన మార్పుకు విస్తుబోతూ కారణాలు వెదక జూపినా అవగతం కాలేదు. తన చంటిదానికి బలవంతంగా అన్నం అలవాటుచేసే ప్రయత్నంలో యిద్దరిమీద కోపాన్ని త్యజించాడు.

ఈ సంఘటన జరిగిన మూడవ రోజున వరాలమ్మ హఠాత్తుగా పట్నం వెళ్ళిపోయింది. ఇది మేడలో అద్దెకుంటూన్న వాళ్ళకు గొప్ప అవకాశంగా తోచింది. వారం రోజులు ఏకధాటిగా సమావేశమై వరాలమ్మ చరిత్ర అంతా తిరగతోడేశారు. ఆఖరికి ఎం. ఎల్. ఏతో గది విడిచి బయటకు రాకుండా గడిపిన సంఘటనలతో సహా అన్నీ చర్చించేశారు. ఈ చర్చలలో రామచంద్రం పాల్గొనకపోయినా సారాంశాన్ని శ్రోతగా విని "అయితే నా వూహ కరెక్ట్ అన్నమాట. ఎం. ఎల్. ఏ ప్రోద్బలంతోనే ఆమె మనసు మార్చుకుంది." అని నిర్ధారణ చేసుకున్నాడు. వెంటనే అతనికో సందేహం వచ్చింది. మరి తన బిడ్డకు కూడా యెందుకు పాలివ్వడం మానుకుంది? అనే ప్రశ్నకు. "ఆ ఏముంది ఒంటి బిగిపోతుందని ఎం.ఎల్.ఏ సలహా యిచ్చివుంటాడు, అందుకని మానేసింది" అని యెవరో అన్నారు. ఔరా అనుకున్నాడు రామచంద్రం.

పదిహేను రోజుల తర్వాత వరాలమ్మ పట్నం నుంచి తిరిగివచ్చింది. అమ్మలక్కలు వరాలమ్మ ప్రక్కప్రక్కగా చేరి పట్నం వెళ్ళడానికి గల కారణాలు ఆరాతీయగా తెలిసిందేమిటంటే ఆమె వైద్యంకోసం పట్నం వెళ్ళిందని. వైద్యం ఎందుకంటే స్థనాలు సెప్టిక్ అయాయని! సెప్టిక్ అవాల్సిన అసవరం ఏమొచ్చిందీ అనేదానికి ఎం. ఎల్. ఏ విడిది చేసినందుకని అమ్మలక్కలు సమాధానం చెప్పేసుకున్నారు.

ఈ వివరాలన్నీ భార్య చెబుతూంటే రామచంద్రం విని ఆశ్చర్యపోయాడు. వరాలమ్మ అందాన్ని కొరుక్కుతినే ప్రయత్నంలో ఎం. ఎల్. ఏ అలా ప్రవర్తించాడా, లేక తన మీదున్న కక్షతో చేశాడా అనేది అర్థంకాలేదు. ఏదో ఒకటి అనుకున్నాడు అన్నం మెతుకులు ఏరుకు తింటున్న చంటిదాని వంక తృప్తిగా చూస్తూ.

ఇప్పుడు రామచంద్రం ఎం.ఎల్.ఏని తిట్టుకోవడంలేదు. అయితే వరాలమ్మ తిట్టని రోజు లేదు. ✱




GOPAL NUT POWDER WORKS
*Prop:* DESU BABURAO
AUTHORISED MANUFACTURERS OF TRIVENI NUT POWDER
NIZAMPET — MACHILIPATNAM (A. P.)
Phone: 488